
# ఇంటింటి బూరి

- పంతుల జోగారావు



**అద్దె గది** దొరకడమే అదృష్టం అనుకుంటూ సామానుతో సహా వచ్చి గదిలో ప్రవేశించాడు చక్రధర్. ఐదు వాటాల వాళ్ళు కాపురం ఉంటున్న పాత కాలపు పెద్ద ఇల్లది. అన్ని వాటాల వాళ్ళకీ ప్రవేశ ద్వారం ఒకటే. దాని కెదురుగా ఉన్న వాటాలో ఇంటాయనా, ఆయన భార్యా ఉంటున్నారు. ఆయన రిటైర్డు రైల్వే ఉద్యోగి. పిల్లలకి ఉద్యోగాలూ పెళ్ళిళ్ళూ అయిపోయి ఎక్కడెక్కడో ఉంటున్నారుట. పగటి పూట వీధి తలుపులు తీసే ఉన్నా రాత్రి పది దాటాక బంద్ అయిపోతాయిట. ఒంటరి గాడయిన తనకి అట్టే చోట ఉండాల్సి రావడం ఇబ్బందే అయినా గత్యంతరం లేదు. ఆ అద్దె గదిలో దిగక తప్పనిది కాదు చక్రధర్‌కి.

పుస్తకాలు రాక్‌లో సర్దుతూ గుమ్మం దగ్గర ఏదో అలికిడయి అటు చూశాడు.

ఎవరో మూడేళ్ళ వయసుండే పాప— తననీ, తను చేస్తున్న పనినీ ఆశ్చర్యంగానూ ఆసక్తితోనూ చక్రాల్లాంటి కళ్ళతో గమనిస్తూ నిలుచుని ఉంది.

ఆ కళ్ళలో అమాయకత్వం ఉట్టిపడుతూంది. వేసుకున్న ఫ్రాక్ కొంచెం మాసి ఉన్నా, ఆ నీలం రంగు ఫ్రాక్‌లో అందంగా ముద్దుగా ఉందా పాప. చేతులకి ప్లాస్టిక్ గాజులున్నాయి. మూతి సున్నాలా పెట్టి ముచ్చటగా చూస్తూంది. కన్నార్పకుండా అలా తన వేపే చూస్తూండడంతో నవ్వొచ్చింది చక్రధర్‌కి. దగ్గిరికి రమ్మని సైగ చేశాడు. క్షణం సేపు తటపటాయించినట్టు కనిపించినా, సంకోచం లేకుండా అతని దగ్గర కొచ్చిందా పాప. పడక మంచం వాల్చి, దానిమీద కూచుంటూ పాపని దగ్గిరికి తీసుకున్నాడు. ఆ పాప లేత బుగ్గమీద చిటికె వేస్తూ అనునయంగా పేరడిగాడు.

"ఇంతింతి బూరి." చప్పున జవాబు వచ్చింది.

ఆ పసిదాని మాటలు చక్రధర్‌కి అర్థం కాలేదు. మళ్ళీ అడిగాడు. అదే జవాబు. ఆ మాటలు మననం చేసుకున్నాక ఆ పాప అంటున్న 'దేవిటో' అర్థమై నవ్వాపుకోలేక పోయాడు. ఆ పేరు విన్నాక మరింత ముద్దొచ్చి, దగ్గిరికి తీసుకుని ముద్దు పెట్టుకున్నాడు.

"అయితే నీ పేరు ఇంటింటి బూరి అన్నమాట. గుడ్. ఎంత బాగుందో నీ పేరు. నాకో బూరి ఇస్తావ్?"

ఆ మాటలేం అర్థం కాలేదు పాపకి. మరేం మాట్లాడకుండా చక్రధర్ చేతి వేలికి ఉన్న ఎర్రరాతి ఉంగరాన్ని తడిమి చూస్తూ ఉండిపోయింది.

చక్రధర్‌కి సంతోష మనిపించింది ఇక్కడ మరీ బోర్ కొట్టేస్తుందేమో

అని భయపడ్డాడు, కానీ అప్పుడప్పుడు ఈ ఇంటెంటి బూరితో చక్కని కాల క్షేపం అవుతుందనిపించి తృప్తి పడ్డాడు. ఇంతకీ ఆ పాప ఎవరి పాపో అడగనే లేదు.

"మీ ఇల్లెక్కడమ్మా?" అడిగాడు తెలుసుకుందామని.

"ఇక్కడే!" జవాబు చెప్పేకకిసుక్కున నవ్వింది పాప—ఆ మాత్రం తెలీదా అన్నట్టు.

"మీ నాన్నగారి పేరేంటమ్మా?"

జవాబు చెప్పలేదు.

"పోనీ మీ అమ్మగారి పేరు?"

అప్పుడు తల్లి గుర్తొచ్చింది కాబోలు అతని చేతుల్లోంచి జారిపోతూ "అమ్మ. అమ్మ" అంటూ వెనక వాటాలవైపు తుర్రుమంది.

పాప కింకా మాటలు బాగా వచ్చినట్లు లేదు. తెలిసీ తెలియని వూహ.

"స్వీట్ బేబీ!". నవ్వుకుంటూ గది సర్దడంలో మునిగి పోయాడు చక్రధర్.

• • • • • •

ఉదయం ఆరున్నరకి మెలుకువ వచ్చింది చక్రధర్‌కి.

బద్ధకంగా ఒళ్ళు విరుచుకుని మంచం మీదనుంచి లేచాడు. బ్రష్ మీద టూత్‌పేస్ట్ వేసుకుని భుజం మీద టవలు సర్దుకుని, ఒక చేత్తో బకెట్‌తో పెరట్లోకి వెళ్ళాడు. కొళాయి మాత్రం అందరికీ కామన్. అద్దెల వాళ్ళు వంతుల వారీగా చకచకా నీళ్ళు పట్టుకుని తమ పనులు చేసుకు పోతున్నారు. కొళాయి దగ్గర ఆడవాళ్ళు చక్రధర్ వేపోసారి చూసి, కొంచెం తప్పుకుని నిలుచున్నారు. చక్రధర్‌కి మొహమాటంగా ఉంది. తల దించుకుని నీళ్ళ కింద బకెట్ పెట్టాడు. బకెట్ నీళ్ళతో నిండుతూ ఉంటే చూస్తూ నిలుచున్న చక్రధర్‌కి తన భుజం మీద తువ్వాలు నెవరో లాగుతున్నట్లనిపించి పక్కకి తిరిగాడు.

నవ్వుతూ నిలుచుని ఉంది పాప.

"హాయ్! ఇంటెంటి బూరి! అప్పుడే నిద్ర లేచి పోయావమ్మా. గుడ్‌మార్నింగ్" నవ్వుతూ అన్నాడు చక్రధర్.

అతని మాటలు విని ఆడవాళ్ళు ఫక్కున నవ్వారు.

వాళ్ళలో వయసులో కాస్త పెద్దావిడ కలగ జేసుకుని అంది—"ఈ గడుగ్గాయి అప్పుడే పరిచయ మయిందన్నమాట. కొత్త లేదు దీనికి. నిన్ననే ముందు గదిలో దిగావు కదూ? ఏం పనిచేస్తున్నా వబ్బాయ్?"

చక్రధర్ చెప్పాడు.

"అదిగో—ఆ వసారాకి అవతల వేపు పోర్షన్‌లో నీలవేణని ఉంటూంది. ఆవిడ కూతురే పాప. నదురూ బెదురూ లేదు. దీని కాళ్ళకి చక్రాలున్నాయి. అస్తమానం అందరిళ్ళకీ తిరుగుతూ ఉంటుంది. ఎవరయినా పలకరిస్తే చాలు ఒళ్ళో వచ్చి వాలి పోతుంది. ఇదివరకు నువ్వుండే గదిలో దిగిన కుర్రాడు దీనికి ఇంటెంటి బూరని ముద్దు పేరు పెట్టాడు. మాఅందరికీ ఆ పేరే అలవాటయింది." వివరించిందావిడ. నీళ్ళు పట్టుకుని ఎవరి త్రోవన వాళ్ళు వెళ్ళిపోయారు.

పాప కొళాయికి చేతులు అడ్డం పెడుతూ నీటని చిమ్ముతూ అల్లరి చేస్తోంది.

"పాపా! నీళ్ళలో నానకు. రావమ్మా!". సన్నని మధురమయిన గొంతు వినిపించి మరుగ్గా అటు చూశాడు చక్రధర్. ఎవరూ కనిపించ లేదు. పాప అతని మీదకి అరచేత్తో నీళ్ళు చిమ్మి అక్కడ నుంచి నవ్వుతూ పారిపోయింది.

చక్రధర్ నవ్వుకున్నాడు. పాప తల్లి పేరు నీలవేణి అన్నమాట. పాప ఆమె అందాన్ని పుణికి పుచ్చుకుని ఉంటుంది. పాపని బట్టి ఆమె అందాన్ని అంచనా వేయడానికి ప్రయత్నిస్తూ తన పని కానిచ్చాడు చక్రధర్.

ఆఫీసుకి బయలు దేరుతూ ఉంటే ఇంటాయన పలకరించారు. అతని చంకలో పాప ఉంది.

వస్తూనే అడిగా రాయన: "ఏం బాబూ గదీ అదీ అంతా సౌకర్యంగా ఉందా?"

లేదని ఎలా అనగలడు. ఓ! అన్నట్టుగా తలూపాడు.

"ఆఫీసుకి బయలుదేరి నట్టున్నావు. వెళ్ళిరా. బూరి తల్లీ! అంకుల్‌కి టాటా చెప్పమ్మా."


చెయ్యి వూపింది పాప.

ఇంతమంది ప్రేమని రోజూ పొంద గలుగుతున్న ఆ పాప అదృష్టాన్ని మెచ్చుకో కుండా ఉండలేక పోయాడు చక్రధర్.

రోజులు గడిచే కొద్దీ అన్ని వాటాల వాళ్ళతోనూ కొద్ది కొద్దిగా పరిచయ మయింది చక్రధర్‌కి. నీలవేణినికూడా చాలా సార్లు చూడడం జరిగింది. ఆమె గురించి చాలా విషయాలు తెలుసుకో గలిగాడు.

నీలవేణి అందం చూసి అతడు ఒక్క క్షణం వివశుడైన మాట వాస్తవం. ఒత్తయిన నల్లని జుత్తు, వెడల్పాటి కళ్ళు, గుండ్రని భుజాలు, తెల్లని శరీర






వాయి. నీలవేణి నిజంగా చాలా అందగత్తె. భర్తృవిహీన కావడం ఎంతో బాధపడుతున్నట్టు. చిన్న వయసులోనే కష్టాల తుఫానులో చిక్కుకోబట్టి కాని లేకపోతే ఆమె అందమయిన కళ్ళు ఇంత దీనత్వం నింపుకుని ఉండేవా? ఆ కళ్ళలోని మెరుపు ఆమె చుట్టూ ఉండే వాతావరణాన్ని ఎన్ని వెలుగులతో నింపి ఉండేదో! భర్త పోయాక ఆమె ఎవరి ఆదరణకీ నోచుకోలేక పోయిందిట. తల్లీ తండ్రీ లేరు. ఉన్న ఒక్క అన్నదమ్ముడూ భార్యాపిల్లలతో ఎక్కడో అస్సాంలో ఉంటున్నాడు. అతను మాత్రం నెలకో నూట యాభై పంపిస్తూ ఉంటాడుట. ఒక్కో నెలలో అదీ ఉండదట.

ఆమె సహనంతో, ఓర్పుతో ఆపదలని ఎదుర్కోవడానికే సిద్ధ పడింది. ఒక కాన్వెంట్‌లో టీచరుగా కుదురుకుంది. ఆ వచ్చే వందా పాతికతో కాలం నెట్టుకు వస్తోందిట. ఆమె గురించి విన్నాక చక్రధర్‌కి ఆమెకి ఎలాగయినా ఏదో విధంగా సాయపడాలనే కోరిక బలీయమైంది. ఆమెకు తన పూర్తి సహకారాన్ని అందించాలనే ఆరాటం ఉద్రేకంగా మారినప్పటికీ ఏం చెయ్యాలో, ఆమె దాన్ని స్వీకరిస్తుందో తెలీక ఉండిపోయాడు చక్రధర్. రోజులు దొర్లిపోతున్నాయి. పాప అతనికి మరింత సన్నిహితమయింది. గదిలో ఉన్నప్పుడు పాపతోనే కాలక్షేపం. పాప వేసుకునే గౌన్లు చిన్న చిన్న చిరుగులు పట్టి ఉండటం గమనించినప్పుడల్లా అతనికి నీలవేణి ఎంత ఇబ్బందుల్లో ఉందో అనిపిస్తూ ఉంటుంది. పాపకి చాక్‌లెట్లూ అవీ కొని తెస్తూ ఉండేవాడు.

• • •

చక్రధర్ పనిచేస్తున్న ఆఫీసొక మాయాభవనం లాంటిది. అక్కడ నిత్యం వింతలూ విడ్డూరాలూ చాలా జరిగిపోతూ ఉంటాయి.

ఉన్న కాగితాలు మాయమైపోతూ ఉండటం, లేనివి సృష్టింపబడటం అక్కడ సాధారణమయిన అంశం. ఫైళ్ళు కదలడం కదలక పోవడం అనేది చాలా ఫాక్టర్స్ మీద ఆధారపడి ఉంటుంది. కరెన్సీనోట్లూ, విందులూ, మందూ, పనితీవ్రతని బట్టి మగువా, ఇలా చాలా తతంగం జరిగితే కానీ ఆ ఆఫీసులో కలాలు కాగితాల మీద కదను తొక్కవు. అథవా కలం కాగితం మీద పడినా అర్థం పర్థం లేని కొర్రీల శూలాలు గుచ్చుబడి ఆ పేపర్లు చచ్చుబడిపోవలసిందే.

పనిచెయ్యడం కన్నా చెయ్యకపోవడంలోనే ఆత్మానందాన్నీ, అధికార దర్పం చూపించడంలోనే గర్వాన్నీ తృప్తినీ పనిచేసే వ్యక్తులతో నిండిపోయిన నరకం అది.

చక్రధర్‌కి కూడా అందులో మినహాయింపు లేదు.

అందుకే ఇంటికి నెలనెలా మూడొందలు దాకా పంపించ గలుగుతున్నాడు. తన పేరుమీద వైజాగ్‌లో ఇంటికోసం ఒక స్థలం కొనుక్కో గలిగాడు. బాంకు పాస్‌బుక్‌లో అంకెలు పెంచుకోగలిగాడు. తను పనిచేస్తున్న ఆఫీసులో ఆ సిరిగల సీటువల్ల దానంతట అది వచ్చి పడే డబ్బుని వద్దనుకుని నిర్లక్ష్యం చేసే ఔదార్యంకానీ, ఉదాత్తతగానీ అతనిలో లేవు.

ఆఫీస్ రిజిస్టర్‌లో సంతకం చేసి సీట్లో కూర్చున్నాడు చక్రధర్. అతని మనసులో నీలవేణి మెదుల్తోంది. నీలవేణికి సహాయపడగలిగితే అవకాశం అంత త్వరగా వస్తుందని అతననుకోలేదు. ఆమె ఆ ఇంట్లో తన కళ్ళబడటం అంతంత మాత్రమే. ఎప్పుడూ నోరు విప్పి మాట్లాడదు. మాట్లాడటానికి అవకాశమూ ఇవ్వలేదు. ఆమె గంభీరమయిన వ్యక్తిత్వం అతణ్ని చకితుణ్ని చేస్తూ ఉంటుంది.

అలాంటి మనిషి — ఇవాళ ఉదయం ఇంటాయన్ని తోడ్చుకుని అతని దగ్గరికి వచ్చింది. అతనికి ఆశ్చర్యం వేసింది. 'రండండి' అని ఆహ్వానించి సాధారణ పలకరింపు అయ్యాకవచ్చినపని అడిగాడు. నీలవేణి తరఫున ఇంటాయనే మాట్లాడాడు. నీలవేణి భర్తకి సంబంధించిన డబ్బు బకాయిలేవో రావాల్సి ఉందిట. ప్రస్తుతం ఆ వ్యవహారాలకి సంబంధించిన ఫైలంతా చక్రధర్ పనిచేసే ఆఫీసులోనే ఉందిట. అతనీ వూరికి రాకముందు ఆ విషయమై నీలవేణి ఒకటి రెండుసార్లు ఆఫీసు కెళ్ళి వచ్చిందిట కూడా. కాని ఫలితం కనిపించలేదు. ఆ విషయంలో తన సహాయం కోరడానికి వచ్చిందామె. నీలవేణికి సహాయపడగలిగే అవకాశం ఇలా వస్తుందని భావించని చక్రధర్‌కి సంతోషం కలిగింది. ఆమె అందజేసిన సమాచారం ప్రకారం ఆ ఫైలు వ్యవహారాలు చూసేది చక్రధర్ కాదు. మరో క్లార్కు, మన్మథరావ్. అతనితోచెప్పి పనయేలా చూస్తానని మాట ఇచ్చాడు చక్రధర్.

ఆఫీసులో స్టాఫంతా చేరేసరికి పదిన్నరయింది. ఇంకా ఎవరూ కాగితాలు తియ్యలేదు. కలాలు విప్పలేదు. అదంతే. ఉదయం పదకొండు దాకా అలాగే ఉంటుంది. ఆ తర్వాత టీకని వెళ్ళి రావటం సీట్లలో కూర్చోవే ఏవో విషయాల మీద గంభీరమయిన చర్చలు. మళ్ళీ మధ్యాహ్నం లంచ్ బ్రేక్. మళ్ళీ సీట్లలో కూలబడటం — మళ్ళీ టీ— కబుర్లు. వాస్తవానికి రోజూ జరిగే తతంగమే ఇది. ఎవరయినా పనిమీద స్వయంగా వచ్చి డబ్బులిచ్చి తొందర చేస్తే తప్ప — వాళ్ళపని ముట్టుకోక పోవడం అక్కడ సర్వసాధారణమయిన అలవాటు.

చక్రధర్ లేచి మన్మథరావు సీటు దగ్గరి కెళ్ళాడు. మన్మథరావు నవ్వుతూ విష్ చేశాడు. చక్రధర్ అతనికి నీలవేణి ఇచ్చిన సమాచారం అందిస్తూ, ఆమె పని త్వరగా అయ్యేటట్టు చూడమనికోరాడు.

చక్రధర్ చెప్పింది విని, మన్మథరావు అతని ముఖంలోకి ఆశ్చర్యంగాచూశాడు

"ఆవిడ మీ బంధువా?" అడిగాడు

"కాదు. తెలిసినావిడ. నే నుండే ఇంట్లోనే ఓ పోర్షన్‌లో ఉంటోంది."

"అలా చెప్పు గురూ!" అని నవ్వాడు మన్మథరావు, ఆ ఒక్కమాటలో అనేక అర్థాలు గోచరింపచేస్తూ. చక్రధర్ దెబ్బ తిన్నట్టు చూశాడు. కాని ఏం అనలేదు.

"సరేలే. ఇవాళే నోట్ పుటప్ చేస్తాను."

థాంక్స్ చెప్పి రెండు కాఫీలు తెప్పించి అతని కొకటి ఇచ్చి తను త్రాగాక, చక్రధర్ తన సీట్లోకి వచ్చేశాడు సాయంత్రం ఏదో పనుండి మళ్ళీ ఆ విషయం కనుక్కోలేదు.

ఆ మర్నాడు నీలవేణి కనిపిస్తే ఆమె పని గురించి మాట్లాడాననీ తప్పక జరిగిపోతుందనీ చెప్పాడు.

వారం తిరిగిపోయింది. కాని నీలవేణి పెట్టుకున్న కాగితాలు మాత్రం కదల్లేదు. చక్రధర్ అడిగినప్పుడల్లా మన్మథరావు అదనీ, ఇదనీ చెప్పి దాటవేస్తున్నాడు.

చక్రధర్‌కి అతనిమీద కోపం ముంచుకొస్తోంది. ఆ సెక్షన్ సూపరింటెండెంట్‌తో నీలవేణి విషయం చెబుదామనుకున్నాడు. కాని మన్మథరావు నొచ్చుకుంటాడని వూరుకున్నాడు. నీలవేణి కలిసినప్పుడల్లా ఆమె చూపుల్లోని అభ్యర్థననీ, దీనత్వాన్నీ చూసి అతను చలించిపోతున్నాడు. రోజులు గడిచిపోతున్నా తను ఆఫీసులో పనే చేయించలేకపోతున్నాడతను. నీలవేణి ఏమనుకుంటోందో!

నీలవేణి గురించి తనింత ఇంట్రెస్టు చూపించడంతో ఆఫీసులో అందరూ చెవులు కొరుక్కోవడం గమనించాడు చక్రధర్.

